
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

ఆదివారం 9 మార్చి 2025

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (ఆదివారం సాయంత్రం)	సెహరీ (సోమవారం ఉదయం)
కడప	6.30	5.11
ప్రొద్దుటూరు	6.31	5.15

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

● జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి

కడప రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం కలుగుతుందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి పేర్కొన్నారు. జిల్లాకోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. తమ సమస్యలను లోక్ అదాలత్‌లో ఇరు పక్షాలు రాజీమార్గంలో పరిష్కరించుకుని తద్వారా సత్వర న్యాయం పొందడంతో పాటు, డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో ఒకసారి కేసు పరిష్కారం అయితే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. లోక్ అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవన్నారు. దీర్ఘకాలిక కేసులకు కూడా లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా చక్కటి పరిష్కారం దొరుకుతుందన్నారు. కడప కోర్టుతో పాటు, వివి ధ ప్రాంతాలలోని కోర్టులలో జాతీయ జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించి 6053 కేసులకు అవార్డులు ఇచ్చామన్నారు. ఇందుకు రూ. 15,58,91,342లు చెల్లింపులు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కోర్టుల జడ్జిలు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధి, నాణ్యతలో రాజీ లేదు: మంత్రి

కడప కలెక్టరేట్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): రోడ్ల అభివృద్ధి, నాణ్యతలో రాజీకి తావులేదని అధికారులు చిత్తశుద్ధితో పనులు సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా పర్యటనలో భాగంగా శనివారం కడప జిల్లాకు విచ్చేసిన ఆయనను అతిథి గృహంలో జిల్లా ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో రోడ్ల అభివృద్ధి పనులు, గుంతల రహిత రోడ్ల మరమ్మతులపై ఆరా తీశారు. జిల్లా పరిధిలో గుంతల రహిత రోడ్ల కార్యక్రమంలో భాగంగా 219 పనులకు గాను రూ.35 కోట్లు కేటాయించగా 99 శాతం పనులు ఇప్పటికే పూర్తిచేశామని జిల్లా అ ధి కా ర ు లు అన్నారు. అలాగే కడప బైపాస్‌కు మరో 14కి.మీ గుంతలు పూడ్చడానికి ఒప్పందం పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. ఇర్కాన్ సర్కిల్ నుంచి ఊటుకూరు(ఆర్‌ఓబీ) వరకు 6 కి.మీ గుంతలు పూడ్చే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. సకాలంలో బిల్లులు అప్‌లోడ్ చేసి కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు.



స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 105.59 కోట్ల మెగా చెక్కును అందజేస్తున్న మంత్రి సవిత, కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితీసింగ్, ఎస్పీ అశోక్ కుమార్, ఎమ్మెల్యే ఆర్. మాధవి తదితరులు



లబ్ధిదారులకు ఆటో అందజేస్తున్న మంత్రి

మహిళా సాధికారతే ధ్యేయం

● మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి సవిత

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు మహిళా పక్షపాతి అని, మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం కడపలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలతోనే మెరుగైన సమాజం సాధ్యమని భావించి స్వర్గీయ ఎన్టీఆర్ మహిళల్ని రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేశాడన్నారు. దీంతో వంట గదులకే పరిమితమైన మహిళలు చట్టసభల్లో ఆశీనులయ్యారన్నారు. మహిళలకు ఆర్థిక లబ్ధి చేకూర్చేలా సీఎం చంద్రబాబు పథకాలు రూపొందిస్తున్నారన్నారు. ఈ ఏడాది లక్ష మంది మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దనున్నామన్నారు. లక్ష మందికి పైగా మహిళలకు కుట్టుమిషన్ల అందజేస్తున్నామన్నారు. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలను చదివించాలని పిలుపునిచ్చారు. తాను ఎన్నో అడ్డంకులను అధిగమించి నేడు మంత్రి స్థాయికి ఎదిగానని మంత్రి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ గతంలో మాదిరిగా వంటింటికే పరిమితం కాకుండా నేడు మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారన్నారు. అన్ని కార్పొరేషన్ల ద్వారా మహిళల అభివృద్ధికి రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందిన ఆడబిడ్డలను ఇంకా సమాజంలో చిన్నచూపు చూడడం సరికాదన్నారు. మన జిల్లాలో కొత మంది 8 నుంచి 10వ తరగతి లోపు ఆడబడ్డల విద్యను మాన్పిస్తున్నారని.. ఇది తప్పు అని ఆడబిడ్డల చదువును ప్రోత్సహించాలన్నారు.

ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ మహిళలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. మహిళలు పురుషుల కంటే తెలివిగా ఉంటారన్నారు. ప్రభుత్వం మహిళల రక్షణకు అనేక చర్యలు తీసుకుందన్నారు. జేసీ అదితిసింగ్ మాట్లాడుతూ మహిళలకు పురుషులతో పాటు సమాన హక్కులు రావాలన్నారు. మహిళకు విద్య ఎంతో అవసరమని, అవకాశాలు కల్పిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలదన్నారు. కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆర్.మాధవి మాట్లాడుతూ మహిళలు బహుముఖ ప్రజ్ఞాశాలురని అన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్తమ సేవలు అందించిన జిల్లాలోని మహిళా అధికారులు, అన్ని శాఖలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు జ్ఞాపికలు అందించి సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ రుణాలు రూ.105.59కోట్లు, 69 మంది ఎస్‌హెచ్‌జీ లబ్ధిదారులకు సెర్ప్ ఉన్నతి వడ్డీలేని రుణాలు రూ.1.08, కోట్లు, పీఎం విశ్వకర్మ యోజన కింద 42 మంది మహిళా చేతివృత్తి పనివారికి బ్యాంకు రుణాలు రూ.3.07కోట్లు, నలుగురు ఉత్తమ మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రేరణ సఖిల కింద ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతి చెక్కులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు శ్రీలక్ష్మి, ఆనందనాయక్, కిరణ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఆటో నడుపుతున్న మంత్రి

అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

● ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర చాలా కీలకమని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన వేడుకలకు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మనిషి భూమిపై పుట్టినప్పటి నుండి చనిపోయేంత వరకు జీవితంలో స్త్రీ పాత్ర వెలకట్టలేనిదన్నారు. తనకు జన్మనిచ్చిన మాతృమూర్తికి, 15 సంవత్సరాలుగా తన విధి నిర్వహణలో ఎంతో సహకారమందిస్తున్న తన సతీమణికి ఈ సందర్భంగా ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. స్త్రీ సమానత్వమే సమాజ ప్రగతికి మూలమన్నారు. సహనం, ఓర్పు, ధైర్యంతో కుటుంబాన్ని తద్వారా సమాజాన్ని, దేశాన్ని అగ్రస్థానంలో నిలపడంలో మహిళల పాత్ర అమోఘమని అన్నారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ మహిళ ఒక లీడరుగా కుటుంబానికి పెద్దగా వ్యవహరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా విశిష్ట సేవలందించిన మహిళా అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ డెంటల్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోత్స్న, వైవీయూ ప్రొఫెసర్ మమతాకుమారి, డీఎస్పీ భవాని, మహిళా ఎస్ఐ లక్ష్మీదేవిని, పోలీసు కార్యాలయ సిబ్బందిని సన్మానించారు. ముందుగా కోటిరెడ్డిసర్కిల్ నుంచి మహిళా సాధికారత ర్యాలీని ఎస్పీ ప్రారంభించారు. అక్కడ నుంచి ర్యాలీ ఎస్పీ కార్యాలయం వరకు సాగింది.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్, ప్రొద్దుటూరు డీఎస్పీ భవాని

బీసీ వర్గాలను బలోపేతం చేయాలి

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత

కడప ఎన్టీఆర్‌సర్కిల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెనుకబడిన తరగతుల వర్గాలను బలోపేతం చేయాలని రాష్ట్ర బీసీ, బలహీనవర్గాల సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బీసీ సంక్షేమ శాఖాధికారులు, ఎంజేపీ విద్యాలయాల ప్రిన్సిపాళ్లు, చేనేత జౌళిశాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నారు. అందుకు అనుగుణంగా అధికారులలు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా కృషిచేయాలన్నారు. జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధిలో భాగంగా ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి సీఎస్ఆర్ నిధుల సేకరణకు ప్రయత్నించాలని సూచించారు. వనిపెంట ఎంజేపీ స్కూల్‌లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ప్రవేశాల అనుమతి కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లాలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందుకుంటున్న లబ్ధిదారులు యూనిట్ల స్థాపనకు తీసుకుంటున్న చర్యలు, ఆ వివరాలపై సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. స్వయం ఉపాధి పథకాల యూనిట్ల స్థాపనకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేలకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఆప్కో వస్త్రాలయాల్లో అమ్మకాలను మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి భరత్‌రెడ్డి, హ్యాండ్‌లూమ్స్ డెవలప్‌మెంట్ అధికారి అహ్మద్ పాల్గొన్నారు.

అరటి ధరలు ధమాల్

● రైతన్నల ఆశలు ఆవిరి

7

ప్రణాళికతోనే.. ఉత్తమ ఫలితాలు

● టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

● టెన్త్ విద్యార్థులకు నిపుణుల సూచన



7

పేదింటికి భరోసా

● అర్ధంతరంగా ఆగిన 65 వేల ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయం

● ఎస్సీ, బీసీ వీవర్స్‌కు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75 వేలు

● ప్రకటించిన చంద్రబాబు ప్రభుత్వం

● వచ్చే ఏడాది మార్చిలోగా ఇళ్ల పూర్తికి కసరత్తు



జగన్ ప్రభుత్వంలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం చేయూత ఇస్తోంది. జగన్ హయాంలో చేపట్టి అర్ధంతరంగా ఆగిపోయిన 65 వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసే బాధ్యతను చంద్రబాబు ప్రభుత్వం నెత్తికెత్తుకుంది. ఇంటి నిర్మాణాలకు గతంలో ప్రకటించిన రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్సీలకు, బీసీ వీవర్స్‌కు మరో రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో 65 వేల మంది పేదలు లబ్ధి పొందనున్నారు. అర్ధంతరంగా ఆగిన ఇళ్ల నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయనున్నారు.

కడప కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం-1.0 కోసం జగన్ పాలనలో జిల్లాలో 4,500 ఎకరాల్లో లక్ష మందికి పైగా పేదలకు ఇళ్లు కట్టిస్తామని ప్రకటించారు. జగనన్న కాలనీలంటూ ఆర్భాట ప్రచారం సాగించారు. కొండలు, గుట్టలు, ఊరి శివార్లలో కాలనీల పేరుతో లేఅవుట్లు వేశారు. అయితే ఆ లేఅవుట్లలో పేదలు ఇళ్లు కట్టుకునేందుకు వీలుగా కనీస సౌకర్యాలైన రోడ్లు, మంచినీటి పైపులైన్లు, విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. కొన్నిచోట్ల మౌలికవసతుల పనులు కాంట్రాక్టర్లకు అప్పగించారు. వీరికి బిల్లులు పెండింగ్ పెట్టడంతో ఏ లేఅవుట్లో కూడా ఆశించిన స్థాయిలో మౌలిక సదుపాయాలు లేవు. ఇకపోతే గతంలో కొన్ని లేఅవుట్లలో వేసిన రోడ్లు, మంచినీటి పైపులైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో పేదల ఇళ్ల నిర్మాణాలకు మౌలిక సదుపాయాల కల్పనపై కూటమి సర్కారు దృష్టి పెట్టింది.

త్వరలో పెండింగ్ బిల్లులు..

జగన్ సర్కారులో కాలనీల్లో మంచినీరు, రోడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాల కోసం రూ7.50కోట్ల పనులు జరిగాయి. అప్పట్లో బిల్లులు చెల్లించని కారణంగా కాంట్రాక్టర్లు పనులు చేయడానికి సుముఖత చూపలేదు. కూటమి సర్కారు పేదల ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో గతంలో పబ్లిక్ హెల్త్ వర్క్‌లకు చెల్లించాల్సిన రూ.7.50 కోట్ల బిల్లుల విషయం కలెక్టర్ దృష్టికి పోయింది. దీనిపై ఆయన వెంటనే ఆర్థిక శాఖకు నివేదించారు. దీంతో పెండింగ్ బిల్లులు రానున్నట్లు తెలుస్తోంది.

కాలనీల్లో రోడ్లు, మించినీరు, విద్యుత్ సౌకర్యం ఉంటే ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయవచ్చని భావించిన ప్రభుత్వం హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కు బాధ్యతలు పెంచింది. దీంతో కొప్పర్తి, మామిళ్లపల్లిలో సౌకర్యాలు కల్పించడంతో గృహనిర్మాణాలు వేగవంతం అవుతున్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అన్ని కాలనీల్లో వసతులు ఉంటే పేదల ఇళ్ల నిర్మాణాలు గడువులోగా పూర్తిచేయడం అసాధ్యం కాదంటారు. దీనికి తోడు ఇప్పుడు ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు రూ.50 వేలు, రూ.75వేల చొప్పున ఆర్థిక సాయం చేయనుండటంతో దాదాపు 65వేలమంది పేదలకు సొంతింటి కల త్వరలోనే సాకారం కానుంది.

ఇక పేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

పేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కానున్నాయి. గతంలో ఇళ్లు కట్టుకోలేని పేదలకు కూటమి సర్కారు అదనపు సాయం చేయనుంది. కూటమి సర్కారు వచ్చిన నాటి నుంచి కొన్ని కాలనీల్లో విద్యుత్ సౌకర్యంతో పాటు ట్యాంకర్లతో తొట్లలో నీళ్లు పోయిస్తున్నాం. ఈ కొద్దికాలంలోనే మరో 3 వేల ఇళ్లను పూర్తి చేయగలిగాం. కాలనీలన్నింటికి త్వరలో ప్రభుత్వం సౌకర్యాలు కల్పించనుంది. దీంతో ఇళ్లనిర్మాణాల టార్గెట్ పూర్తి కానుంది.

- రాజశేఖర్, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్

సర్పంచులలో దడ

● కలవరపెడుతున్న నిధుల దుర్వినియోగం

● బద్రిపల్లి సర్పంచ్‌కు సంజాయిషీ నోటీసు



కడప రూరల్/చాపాడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ నిధులలో ఆర్థిక అక్రమాలకు అవకాశం కల్పించిన సర్పంచ్‌లలో దడ మొదలైంది. వైసీపీ పాలనలో జిల్లాలోని పలు పంచాయతీల్లోని నిధులను అడ్డదారుల్లో అప్పనంగా దోచేశారు. ఆ పాపం ఇప్పుడు వెంటాడుతోంది. వేంపల్లె మేజర్ పంచాయతీతో పాటు, ఒంటిమిట్ట మండలంలోని 13 పంచాయతీలు, తొండూరు మండలంలోని పలు పంచాయతీలు, చాపాడు మండలంలోని బద్రిపల్లి పంచాయతీలో రూ.కోట్లల్లో నిధులను కాజేశారు. కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేపట్టిన అధికారులు ఆయా గ్రామ పంచాయతీలలో ఎవరెవరు ఎంత నిధులను దోచేసింది గుర్తించి వాటిని తిరిగి రాబడుతున్నారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు పలువురిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించారు. ఇప్పుడు సర్పంచ్‌ల వంతు వచ్చింది. పంచాయతీ నిధులలో చోటుచేసుకున్న ఆర్థిక అ క్ర మ ా ల క ు సంబంధించి సర్పంచ్‌ల చెక్ పవర్‌ను ఎందుకు రద్దుచేయకూడదో వివరణ ఇవ్వాలని డీపీవో శాఖ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు తాజాగా శనివారం చాపాడు మండలం బద్రిపల్లి పంచాయతి సర్పంచ్ జి.మల్లేశ్వరికి కలెక్టర్ జారీ చేసిన నోట్ ఉత్తర్వులను డీపీవో రాజ్యలక్ష్మి పంపారు. సదరు పంచాయతీలో మండల కంప్యూటర్ ఆపరేటర్ హనీఫ్‌బాషా రూ.2,56,325లు మేర ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారు. ఈ విషయంపై సర్పంచ్ జి.మల్లేశ్వరి సంజాయిషీ కోరుతూ నోటీస్ జారీచేశారు. సదరు నిధుల దుర్వినియోగానికి సర్పంచ్ చెకర్ అయినందున ఆమె చెక్‌పవర్ ఎందుకు రద్దు చేయకూడదో మూడు రోజుల్లో డీపీవో కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఇదివరకే వేంపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్‌కు కూడా నోటీస్ జారీ చేశారు. మరికొంత మంది సర్పంచ్‌లకు కూడా నోటీసులు జారీకానున్నట్లు సమాచారం.

ప్రణాళికతోనే.. ఉత్తమ ఫలితాలు

పది పరీక్షల వేళ..

త్వరలో జరగనున్న (ఈనెల 17నుంచి 31వ తేదీవరకు) పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికబద్ధంగా చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొంటున్నారు.





- తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి
- టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని విద్యారంగ నిపుణుల సూచన



కడప ఎడ్యుకేషన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించి, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలంటే ఉపాధ్యాయులే కాదు.. తల్లిదండ్రుల పర్యవేక్షణ కూడా తప్పనిసరి అని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లల ఏకాగ్రతకు భంగం కలగకుండా ఉంటే చక్కగా రాణిస్తారని చెబుతున్నారు విద్యావేత్తలు. పాఠశాలల్లో ఈ మధ్య నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలోనూ ఇదే విషయంపై చర్చ జరిగింది. పరీక్షలవేళ తల్లిదండ్రుల భాగస్వామ్యం విద్యార్థులకు కొండంత అండగా నిలుస్తుందని, ఇవి తప్పక పాటిస్తే ఉత్తమ ఫలితాలు సాధ్యం అని చెబుతున్నారు.

టీవీ, ఫోన్లకు దూరంగా ఉండాలి

పెద్దలను చూసే పిల్లలు ఏదైనా నేర్చుకుంటారు. పరీక్షలు దగ్గరపడుతు న్నాయి. మీరు చదువుకోండి అని చెప్పి పెద్దలు ఇంట్లో టీవీ చూస్తే పిల్లలు కూడా అక్కడకు చేరతారు. పరీక్షల పూర్తయ్యేంత వరకు టీవీలు, ఫోన్లకు తల్లిదండ్రులు దూరంగా ఉండాలి. ఇంట్లో ఫోన్లతో పాటు పదోతరగతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వద్ద ఇప్పటికే ట్యాబ్‌లు ఉన్నాయి. వీటిని, పూర్తిగా పరీక్షలయ్యేంత వరకు తల్లిదండ్రుల వద్దనే ఉంచుకోవాలి.

ప్రశాంత వాతావరణం కల్పిస్తే..

అవకాశం ఉన్నవాళ్లు విద్యార్థి చదువుకునేందుకు ఇంట్లో ప్రత్యేక గది (రీడింగ్ రూమ్) కేటాయించాలి. ఆ గదిలో గతంలో పిల్లలు సాధించిన విజయాలు వారికి గుర్తుకొచ్చేలా కనిపించేట్లుగా ఉంచాలి. వాటిని చూసి మరింత స్ఫూర్తి పొంది చదువుకునే వీలుంటుందని నిపుణులు చెబుతున్నారు. చదువుకునే గదిలోకి ఎటువంటి శబ్దాలు, ఇతరులు రాకుండా చూసుకోవాలి. ఒకవేళ ప్రత్యేక గది లేనట్లయితే రీడింగ్ కార్నర్ ఏర్పాటు చేసి విద్యార్థి చదువుకునేందుకు ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలి.

ఆహారం ముఖ్యం

పరీక్షలు దగ్గర పడుతున్న ఈ సమయంలో విద్యార్థికి రాత్రిపూట తేలిక పాటి, త్వరగా జీర్ణమయ్యే ఆహారాన్ని ఇవ్వడం మేలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. విద్యార్థులకు శక్తినిచ్చే చిరుధాన్యాలు, పాలు, పండ్ల రసాలు వంటివి ఇస్తే వారు మరింత చురుగ్గా చదువుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఏం రాశారో ఆరా తీయాలి

విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి రాగానే పాఠశాలలో నిర్వహించిన రోజువారి పరీక్ష ఏ విధంగా రాశావు.. క్లాస్‌లో ఏం చెప్పారన్నది తెలుసుకోవాలి. ఏమైనా సందేహాలున్నాయా..? ఉపాధ్యాయులను అడిగావా? అంటూ ఆరా తీయాలి.

ప్రణాళికబద్ధంగా చదవాలి..



పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ప్రణాళికాబద్ధంగా ప్రతి సబ్జెక్టును క్షుణ్ణంగా చదవగలిగితే మంచి మార్కులు సాధించవచ్చు. పరీక్షలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు టీవీ, సెల్‌ఫోన్ అందుబాటులో లేకుండా చేయాలి. ఇది తల్లదండ్రుల ప్రధాన కర్తవ్యంగా భావించాలి. సమతుల్య ఆహారం తీసుకుంటూ శరీరం డీహైడ్రేషన్ కాకుండా నీళ్లు ఎక్కువగా తాగాలి. వీలైనంతగా ప్రశాంత వాతావరణంలో చదివేటట్లు చూడాలి.

- నాగమణి, ప్రధానోపాధ్యాయురాలు, మున్సిపల్ హైస్కూల్ మెయిన్, కడప

అరటి ధరలు ఢమాల్

- రైతన్నల ఆశలు ఆవిరి



గెలలను కట్ చేసి బాక్సులలో నింపుతున్న కూలీలు

లింగాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలం ఉద్యాన పంటలకు ప్రసిద్ధి. మండల వ్యాప్తంగా అరటిపంటను రైతులు విస్తారంగా సాగుచేస్తున్నారు. నెలరోజుల క్రితం అరటి ధరలు అమాంతంగా పెరిగి టన్ను రూ.28వేలకు చేరుకున్నాయి. దీంతో అరటి రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నెలరోజులు నిలకడగా ఉన్న ధరలు కొద్దిరోజులుగా ప్రతిరోజు తగ్గుతూ వస్తున్నాయి. గెలలతో అయితే నాణ్య మైన కాయలను గరిష్ఠంగా రూ.16వేలు, కనిష్ఠగా రూ.14వేలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కంపెనీ బాక్సులకు అయితే నాణ్యమైన కాయలను రూ.19వేల వరకు కొనుగోలు చేస్తున్నారు.

ధరలు పెరిగిన సమయంలో చాలా తక్కువ మంది రైతులకు సంబంధించిన పంట దిగుబడులు మాత్రమే వచ్చాయని, పంట దిగుబడులు ఇప్పుడిప్పుడే చేతికందుతున్న సమయంలో టన్నుకు పదివేల రూపాయలు ధర తగ్గిందని రైతులు వాపోతున్నారు. సీజన్ మొత్తం ధరలు నిలకడగా ఉంటేనే అంతో ఇంతో లాభాలు వచ్చేవని.. గత మూడు సంవత్సరాల నుంచి పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయని చెబుతున్నారు. ఎకరాకు సుమారు రూ.2లక్షలు పెట్టుబడి అవుతోందని, పంటకాలం 11 నుంచి 12నెలల పడుతుందన్నారు. పెట్టుబడులకు వడ్డీలు కలుపుకుంటే.. ఇప్పుడున్న ధరలతో ఏమి మిగలదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్రలోను దిగుబడులు రావడం ధరల పతనానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు.



గెలలతో ఉన్న అరటి పంట

కుక్క అడ్డు రావడంతో కారు అదుపు తప్పి బోల్తా

- బాలుడి మృతి.. నలుగురికి తీవ్రగాయాలు



రామాపురం, మార్చి8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు 40వ జాతీయ రహదారిలో చిట్లూరు పంచాయతీ పాలన్నగారి పల్లె వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దర్శత్‌సాయి (1) అనే బాలుడు మృతి చెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. గుర్రకొండ టౌన్‌కు చెందిన పాలకొండరాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి కడపకు సమీపంలోని పాలకొండకు స్వామిని దర్శించు కునేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని పాలన్నగారిపల్లె వద్దకు రాగానే రోడ్డుపైన కుక్క అడ్డురావడంతో డ్రైవర్ కారును పక్కకు తిప్పడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో దర్శత్‌సాయి మృతి చెందగా.. డ్రైవర్ రాఖీ, నాగేశ్, మౌనిక, పూజిత గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఊటుకూరు వద్ద వృద్ధుడు మృతి

సీకేదిన్నె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరు వద్ద కుక్క అడ్డు రావడంతో మోటారు సైకిల్‌లో వెళుతున్న వ్యక్తి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంటు పోల్‌ను ఢీకొనడంతో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... కడప నగరం నడింపల్లెకు చెందిన గంపా వెంకటసుబ్బయ్య (70) శనివారం ఉదయం కడప నుంచి రాయచోటివైపునకు జమాల్‌పల్లి పోయేందుకు మోటారు సైకిల్‌లో బయలుదేరాడు. ఊటుకూరు వద్దకు రాగానే కుక్క అడ్డు రావడంతో బైకు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కరెంటు పోల్‌ను ఢీకొనడంతో వెంకటసుబ్బయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య గంపా చిన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సికెదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

కారు ఢీకొనడంతో యువకుడి..

దువ్వూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లేళ్ల గ్రామం వద్ద శుక్రవారం అర్ధరాత్రి కారు ఢీకొనడంతో దూదేకుల బాష (26) అనే వ్యక్తి మృతిచెందాడు. దువ్వూరు వైపు నుంచి చాగలమర్రివైపు వెళుతున్న వ్యక్తిని కారుఢీకొనడంతో ఈ సంఘటన జరిగినట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

600 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం లారీ

బద్వేలుటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా లారీలో తరలిస్తున్న 600 బస్తాల రేషన్‌బియ్యాన్ని సీఐ రాజగోపాల్ స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జమ్మలమడుగు నుంచి చెన్నైకి అక్రమంగా రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం తెల్లవారు జామున నాలుగురోడ్ల కూడలి వద్ద రేషన్ బియ్యాన్ని, లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీలో 600 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు తెలిపారు. ఈ బియ్యాన్ని శాంపిల్స్‌తీసి ల్యాబ్‌కు పంపించామన్నారు.

సామాజిక బాధ్యత కలిగిన రచనలకే ఆదరణ

- జాతీయ సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవ సభలో వక్తలు



కవి ఏసీ దస్తగిరిని సన్మానిస్తున్న శివచంద్రారెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యత కలిగిన రచనలకే ప్రజల్లో ఆదరణ ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్‌కే గ్రాండ్ ఫంక్షన్ హాలులో కొనిరెడ్డి ఫౌండేషన్ సాహిత్య కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సాహిత్య పురస్కారాలు 2025 ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు వంద మంది కవులు, రచయితలు ఈ సత్కారాన్ని అందుకున్నారు. ఈ సభలో ప్రముఖ డాక్టర్ నరాల రామారెడ్డి మాట్లాడుతూ రచయితలను ప్రోత్సహించే ఇలాంటి సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గౌరవ అతిథి, పద్య కవి ఏసీ దస్తగిరి మాట్లాడుతూ పురస్కారాలు స్వీకరించడం ద్వారా రచయితలు కవులపై మరింత బాధ్యత పెంచినట్లేనన్నారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు డాక్టర్ రాజయ్య మాట్లాడుతూ సామాజిక రుగ్మతలపై కొరడా ఝుళిపించే కవుల కవితలు ఎంతో స్ఫూర్తిదాయకమైనవన్నారు. నవలా రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకులు సాహిత్యాన్ని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు కవులు, రచయితలను ఘనంగా సన్మానించారు. అంతకుముందు పుట్టపర్తి నారాయణాచార్యులు, వేమన, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలకు పూల మాలలు వేసి వారి ఆశయ సాధనలో పనిచేస్తామని ప్రతినబూనారు. కార్యక్రమంలో కొనిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు శివచంద్రారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత డీకే చదువుల బాబు, తవ్వాఓబులరెడ్డి, ఈతకోట సుబ్బా రావు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ నిందితులకు పరామర్శ



కడప సెంట్రల్‌జైలు వద్ద బీజేపీ నేతలు

కడప మారుతీనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాయచోటి వీరభద్ర స్వామి ఊరేగింపులో ఇటీవల జరిగిన ఘర్షణలో అరెస్టు అయిన కడప సెంట్రల్ జైలు ఉన్న వారిని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివ నారాయణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు మెంబరు భాను ప్రకాశ్‌రెడ్డి, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టరు శశిభూషన్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ కలిసి పరామర్శించారు. రాయచోటిలో వీరభద్రస్వామి ఉత్సవాలలో భాగంగా నాలుగు రోజుల క్రితం జరిగిన ఊరేగింపులో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. దీనికి సంబంధించి పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరికి కోర్టు రిమాండ్‌కు ఆదేశించడంతో కడప సెంట్రల్‌జైలుకు తరలించారు. ఇక్కడున్న ఒక వర్గం వారిని బీజేపీ నేతలు శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉత్తమ మహిళా ఉద్యోగులకు ఘన సత్కారం



ఉత్తమ ప్రతిభ కనబరచిన మహిళా ఉద్యోగులతో ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): ఇటు కుటుంబ, అటు ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న మహిళలు ఎంతో సహనశీలురని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి కొనియాడారు. శనివారం స్థానిక ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సమావేశానికి గోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. అనంతరం ఉద్యోగ నిర్వహణలో ఆర్టీసీ జోనల్, రీజనల్ స్థాయిలో వివిధ హోదాలలో ప్రతిభచాటిన మహిళా ఉద్యోగులను నగదు, ప్రశంసాపత్రంతో సత్కరించారు.

ఉత్తమ మహిళా ఉద్యోగులు వీరే....

జోనల్ స్థాయిలో కె.లక్ష్మీదేవి (కుప్పం), దీప్తిసృజన (కర్నూలు-2), లలితమ్మ (కడప), మాధవి (తాడిపత్రి), విశ్వకళాదేవి (తాడిపత్రి), స్వాతి (మద నపల్లి-2)తో పాటు రీజనల్ స్థాయిలో ఈశ్వరమ్మ (పులివెందుల డిపో), రంగ మ్మ (ప్రొద్దుటూరు డిపో) లక్ష్మీదేవి (బద్వేల్ డిపో) నాగలక్ష్మి (మైదుకూరు) ప్రమీళ (కడప డిపో), ప్రియ (జమ్మలమడుగు డిపో) ఉన్నారు. కార్యక్ర మంలో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

టీటీఐ రజితకు అత్యుత్తమ రైల్వే బోర్డు పురస్కారం



రైల్వే బోర్డు చైర్మన్ చేతులమీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న టీటీఐ రజిత

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఓం శాంతినగర్‌లో నివాసం ఉంటున్న రైల్వే టీటీఐ రజితకు రైల్వేశాఖ అత్యుత్తమ పురస్కారం దక్కింది. శనివారం న్యూఢిల్లీ నేషనల్ రైల్ మ్యూజియం ఆడి టోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్క రించుకొని రైల్వే బోర్డు చైర్మన్ సతీష్‌కుమార్ చేతుల మీదుగా పురస్కారాన్ని రజితకు అందించారు. 2024 డిసెంబరు 22న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ ఏసీ కపార్ట్‌మెంట్‌లో రూ.2లక్షలు విలువైన బంగారు చైన్ దొరకడంతో చిత్తూరు జీఆర్పీ సహాయంతో చైన్ పోగొట్టుకున్న ప్రయాణికులకు అందించారు. ఆమె సేవలను గుర్తించి పురస్కారంతో సత్కరించారు. కడపలో టీటీఐగా విధులు నిర్వహిస్తూ ఈ మధ్య కాలంలోనే ఆమె బదిలీపై తిరుపతి వెళ్లారు.

విడిపోయిన దంపతులను కలిపిన జడ్జి



భార్య భర్తలతో మాట్లాడుతున్న జడ్జి సత్యకుమారి

ప్రొద్దుటూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న మనస్పర్థలతో ఏడాది కాలం పాటు విడిపోయి జీవిస్తున్న దంపతులకు జిల్లా రెండో అదనపు జడ్జి సత్యకుమారి కౌన్సెలింగ్ ఇచ్చి కలిపిన అరుదైన ఘటన ప్రొద్దుటూరు లోక్ అదాలత్ కోర్టులో జరిగింది. వివరాల్లోకి వెళితే .. ప్రొద్దుటూరుకు చెందిన సాంబశివారెడ్డి అనే వ్యక్తి శుక్రవీణ అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరిద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. వేర్వేరు కులాలకు చెందిన వీరు ప్రేమించి వివాహం చేసుకొని చిన్న చిన్న మనస్పర్థలతో విడిపోయారు. ఏడాదికాలంగా వేరువేరుగా జీవిస్తున్నారు. భర్త దూరం కావడంతో శుక్రవీణ జాతీయ లోక్‌అదాలత్‌ను ఆశ్రయించారు. రెండో జిల్లా అదనపు కోర్టు జడ్జి సత్యకుమారి దంపతులిద్దరిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మీతో పాటు ఏడాది వయస్సు ఉన్న చిన్నారి ఉన్నాడని.. మీరు విడిపోవడం వల్ల ఆ పిల్లవాడిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. చిన్నారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని.. అన్యోన్యంగా జీవించాలని ఇరువురికి సూచించారు. న్యాయమూర్తి సూచనలతో సాంబశివారెడ్డి తన భార్య శుక్రవీణతో కలిసి జీవిస్తానని అంగీకరించారు. కార్యక్రమంలో సెషన్స్ కోర్టు అదనపు ప్రభుత్వ న్యాయవాది బందెల ఓబులేసు, లోక్ అదాలత్ సభ్యుడు శ్రీనివాసులు, న్యాయవాదులు విజయలక్ష్మి, పద్మజ, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని పూజిత

మదనపల్లె అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చెరువులో దూకి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం ఉదయం మదనపల్లె మండలం తట్టివారిపల్లెలో చోటు చేసుకుంది. మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ వివరాల మేరకు.. కలికిరి మండ లం మహల్ గ్రామానికి చెందిన ఎన్‌కే భాస్కర్ కుమార్తె పూజిత (21) మదనపల్లె సమీపంలోని కృష్ణ చైతన్య నర్సింగ్ కళాశాల్లో మూడో ఏడాది చదువుతూ.. ప్రశాంత్‌నగర్‌లోని బాలాజీ పీజీ హాస్టల్ ఉంటోంది. శుక్రవారం రాత్రి హాస్టల్ వార్డన్ వద్ద మహల్‌కు వెళుతున్నట్లు తెలిపి అనుమతి తీసుకుంది. కాగా, పూజిత చిన్నాయన వెంకటేష్ శుక్రవారం కలకడ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సమాచారం కుటుంబసభ్యులు పూజితకు శుక్రవారం తెలిపారు. తమకు అన్నీ తానై చూసుకునే చిన్నాయన వెంకటేష్ అంత్యక్రియలకు బయలదేరిన పూజిత మనుస్థాపానికి గురై తట్టివారిపల్లె చెరువులో దూకి శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. పూజిత తండ్రి ఎన్‌కే భాస్కర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అనారోగ్యంతోనే అభిషేక్‌రెడ్డి మృతి

● తండ్రి వైఎస్ మధుసూదన్‌రెడ్డి

పులివెందుల టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వైఎస్ అభిషేక్‌రెడ్డి అనారోగ్యంతోనే మృతిచెందాడని అతని తండ్రి వైఎస్ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. తమ కుటుంబానికి వైఎస్ అభిషేక్‌రెడ్డి చనిపోవడం తీరని లోటన్నారు. అయితే సహజ మరణాలను అసహజ మరణాలుగా చిత్రీకరిచేందుకు పథకం ప్రకారం కొన్ని మీడియా సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సిట్ కాదు, జ్యుడిషియల్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మంత్రులకు సత్కారం



కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులను టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాస రెడ్డి, ఆయన సతీమణి కడప ఎమ్మెల్యే మాధవిలు సత్కరించారు. శనివారం ఎమ్మెల్యే నివాసానికి మంత్రి సవితతో కలిసి వచ్చిన రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌళిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వచ్చారు. ఇరువురి మంత్రులను ఎమ్మెల్యే దంపతులు సన్మానించారు. కడప నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలు గాలికొదలడం దారుణం'

వేంపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కరించాల్సిన మంత్రివర్గం సమస్యలను గాలికొదిలి అనారోగ్యంతో మృతిచెందిన వివేకా వాచ్‌మన్ రంగన్న మృతదేహానికి రీపోస్టుమార్టం చేయాలని సుదీర్ఘంగా చర్చించడం టీడీపీ చిల్లర రాజకీయాలకు నిదర్శనమని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో శ్రద్ధ చూపాలన్నారు.

రేపటి నిరసనను విజయవంతం చేయండి

కడప మారుతీనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులబతుకులు దీన స్థితిలో వున్నాయని, అందుకు నిరసనగా 10వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లాలోని అన్ని ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్టీసీ విశాంత్ర ఉద్యోగుల సంఘం రీజియన్ కార్యదర్శి వై. రవీంద్రనాథవర్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై మురుగు పరుగులు

లింగాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె, బోనాల, అంకేవానిపల్లె, కామసముద్రం తదితర గ్రామాలలో సంవత్సరాల నుంచి మురుగు తిష్టవేసింది. వర్షాకాలం, వేసవికాలం తేడా లేకుండా నిత్యం రోడ్ల వెంబడి మురుగునీరు ప్రవహిస్తోంది. శాశ్వత పరిష్కార చూపాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్ల వెంబడి మురుగునీరు ప్రవహిస్తుండడంతో రోడ్లు పాచి పట్టి ద్విచక్రవాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. నిత్యం మురుగు ఇళ్ల మధ్య ఉండడంతో దోమలకు నిలయంగా మారుతోంది. దోమల ద్వారా వ్యాధులు ప్రబలి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ఇక పార్నపల్లె ప్రధాన వీధివెంబడి, బస్టాండ్ వద్ద నిత్యం మురుగు నదిలా ప్రవహిస్తోంది. అధికారులు చొరవ తీసుకొని పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇంకుడు గుంతలు మంజూరు చేస్తాం

: గ్రామాలలో మురుగునీటి సమస్య సంవత్సరాల నుంచి ఉన్నమాట వాస్తవమే. అయితే మురుగునీటి సమస్యకు ప్రజలే కారణమని చెప్పవచ్చు. బాత్‌రూం నీరు, బట్టలు ఉతికే నీరు, ఇంటిని శుభ్రం చేసే నీరు మొత్తం రోడ్లపైకి వదులుతున్నారు. (గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు మంజూరు చేయించి, గుంతకు రూ.6వేలు ఇస్తామని ప్రజల్లో చైతన్య తీసుకువస్తాం.

శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ, లింగాల.



పార్నపల్లెలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు, కామసముద్రంలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు(అంతరచిత్రంలో)

ఘనంగా మహిళా దినోత్సవం

పులివెందుల రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత భారతదేశ ఔన్నత్యానికి, భావి భారత సమన్యాయానికి తోడ్పడుతుందని పులివెందుల జేఎన్టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ శేషమహేశ్వరమ్మ, దిశ, సఖి వన్‌స్టాప్ సెంటర్ అశ్విని పేర్కొన్నారు. శనివారం స్థానిక జేఎన్టీయూ కళాశాలలో మహిళాదినోత్సవం సందర్భంగా జ్యోతప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కోఆర్డినేటర్ డాక్టర్ షేక్ తాజ్ మెహబూబ్, డాక్టర్ సరిత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.కాగా పట్టణంలోని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ రాముడు హాజరయ్యారు. సీడీఎస్ డైరెక్టర్ ఏసురత్నం, ఏపీజీ బీ అసిస్టెంట్ మేనేజర్ ఉమామహేశ్వర, ప్రాజెక్టు మేనేజర్ వల్లి పాల్గొన్నారు.

వేంపల్లె..: ఆర్థికంగా, సామాజికంగా మహిళలు సాధికారత సాధించడమే మహిళా దినోత్సవ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో మహిళా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ హెచ్‌ఎం శివమునెమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలతలను సత్కరించారు.

ట్రిపుల్‌ఐటీలో..: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఎస్ఎస్ కోఆర్డినేటర్లు అపర్ణ, దీప్తి సమాజంలో మహిళల పాత్ర, ఆమె శక్తి అన్న అంశంపై ట్రిపుల్‌ఐటీ విద్యార్థినిలకు అవగాహన కల్పించారు.

కడప ఎర్రముక్కపల్లె..: మహిళాభివృద్ధితోనే సమాజ పురోగతని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష అన్నారు. కడపలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఘనంగా వేడుకలు నిర్వహించారు. వైసీపీ మహిళా నేతలను అంజాద్‌బాష, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఘనంగా సత్కరించారు.

పాత రిమ్స్‌లో: పాత రిమ్స్‌లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి హాజరయ్యారు. మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.



కడప పాత రిమ్స్‌లో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ మహిళా కార్మికులు, ఎస్పీ కార్యాలయం వద్ద పెన్నా కాన్ఫరెన్‌హాల్‌లో కేక్ కట్ చేస్తున్న ఎస్పీ, డీఎస్పీలు తదితరులు

కడప ఎడ్యుకేషన్..: మహిళలు అన్ని రంగాల్లో శక్తిమంతులుగా ఎదగాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు సుజాతరాణి తెలిపారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకొని వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, పాలెం మహేష్‌బాబు పాల్గొన్నారు.

ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో...

కడప(వినాయకనగర్), మార్చి8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శెట్టెం చెన్నెయ్య, రాష్ట్రఉపాధ్యక్షుడు రామాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

కడప కలెక్టరేట్..: జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్యామలమ్మ, నాగరత్న గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షు రాలు ఎన్.డి. విజయజ్యోతి హాజరయ్యారు. కాగా ఎన్జీవో మహిళా విభాగం, రెవెన్యూభవన్, జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కడప కల్చరల్..: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం ఆర్తి ఉమెన్ సెంటర్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు.విజేతలకు గీతా కృష్ణకుమార్ బహుమతులు అందజేశారు.ఆర్తి హోమ్ కార్యదర్శి దుర్గకుమారి, నిర్వాహకులు వాణి, తిరుమలరెడ్డి, లలితా, అరుణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కడప మారుతీనగర్..: మహిళలు అన్నిరంగాలలో రాణించాలని మహిళా విభాగం సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శాంతమ్మ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక రెండోగాంధీబొమ్మ వద్ద ఉన్న ఎస్ఎక్యూ టెక్నాలజీ ట్రావెల్ కార్యాలయంలో మానియాక్‌లతో కలిసి వేడుకలు నిర్వహించారు. ఆయేషా జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ హసీనా, నిర్వాహక అధ్యక్షులు షేక్ అమీర్‌బాషా, కార్యదర్శి డీఎస్ సుబ్బ్ పాల్గొన్నారు.

వేముల..: మహిళలు పారిశ్రామికవేత్తలుగా తయారు కావాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధి రెడ్డి అన్నారు. మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని మండల మహిళా సమాఖ్య కార్యదర్శి రజిత అధ్యక్షతన నిర్వహించారు. ఏపీఎం ఆంజనేయులు పాల్గొన్నారు కాగా మండలంలోని మహిళా సమాఖ్యలో కమ్యూనిటీ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న జ్యోతికి మహిళా దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రం, మెమెంటోలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎమ్మెల్యే మాధవి అందజేశారు.

ప్రధాన రోడ్లలో మురుగు తొలగింపు



వేంపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలోని ప్రధాన రోడ్లు అయిన కడప రోడ్డు, క్రిస్టియన్ కాలనీ వద్ద, గండిరోడ్డులో పారుతున్న మురుగునీటిని పంచాయతీ పారిశుధ్యం సిబ్బంది తొలగించారు. ఈనెల 6వ తేదీన ఆంధ్రజ్యోతి పత్రికలో వేంపల్లె ప్రధాన రోడ్లు మురుగుమయం శీర్షికన వార్త ప్రచురి తమైంది. దీనిపై పంచాయతీ ఉన్నతాధికారులు స్పందించి శనివారం ఆయా రోడ్ల వద్ద కాల్వల్లో పూడిక తీసి రోడ్లపై పొంగి పొర్లుతున్న మురుగునీరును కాల్వలోకి వెళ్లేలా ఏర్పాటుచేశారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

పులివెందుల రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పులివెందుల బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. శనివారం పులివెందులలో కమిటీ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా వి.తులసిరామ్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ.ప్రతాప్‌రెడ్డి, సెక్రటరీగా వి.కిశోర్ కుమార్‌రెడ్డి, ట్రెజరర్‌గా ఎస్.లక్ష్మీనరసింహులు, జాయింట్ సెక్రటరీగా ఎస్.శశిరేఖ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రేపు ఉచిత గ్రహణ మొర్రి పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కడపలోని భవిత కేంద్రలో బసవతారకం స్మైల్ ట్రైన్ సెంటర్ - బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సోమవారం ఉయం 9గంటల నుంచి 1 గంట వరకు ఉచిత గ్రహణ మొర్రి పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి నిత్యానందరాజులు, సహిత విద్య సమన్వయకర్త రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ముకుందరెడ్డి ఆధ్వర్యంలో స్క్రీనింగ్ క్యాంప్ ఉంటుందన్నారు.





అసెంబ్లీలో సమస్యలపై గళమెత్తడం హర్షణీయం

కడప మారుతీనగర్, మార్చి8 (ఆంధ్రజ్యోతి): వంద సంవత్సరాల తమ చిరకాల కోరిక సాకారం అయ్యేలా నిండు అసెంబ్లీలో తమ సమస్యల గురించి గళమెత్తిన ఎమ్మెల్యే ఆర్. మాధవిరెడ్డికి కడప రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండీషనింగ్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (రాక్వా) అధ్యక్షుడు మురళీమోహన్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఆ మేరకు శనివారం ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో గల అసోసియేషన్ కడప కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాక్వా సెక్రటరీ అక్రం రషీద్, ట్రెజరర్ ఎస్. మైనుద్దీన్, కమిటీ సభ్యులు షరీఫ్, ప్రభాకర్‌రెడ్డి, అశ్విన్, సుబ్బు, రాఘవ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కడప రోమన్ క్యాథలిక్ డయాసిస్ బిషప్‌గా పాల్ ప్రకాష్



నూతన బిషప్‌ను అభినందిస్తున్న మాజీ బిషప్ గాలిబాలి

కడప కల్చరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కడప రోమన్ క్యాథలిక్ డయాసిస్ బిషప్‌గా సగినాల పాల్‌ప్రకాష్ నియమితులయ్యారు. ఆ మేరకు నూతనంగా నియమితులయిన పాల్ ప్రకాష్‌ను శనివారం మరియాపురం చర్చిలో కడప డయాసిస్ మాజీ బిషప్ గాలిబాలి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. పాల్ ప్రకాష్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని సెయింట్ జాన్స్ రీజనల్ సెమినరీలో బైబిల్ స్టడీస్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు.

కృషి పట్టుదలతో ఉత్తమ ఫలితాలు



విద్యార్థికి ఫైల్ అందిస్తున్న వికాస్ హరికృష్ణ, వీర సహదేవరెడ్డి

కడప ఎడ్యుకేషన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కృషి పట్టుదలతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీరసహదేవరెడ్డి, వికాస్ హైస్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరిక్రిష్ణ అన్నారు. శనివారం కడప నగరం అక్కాయపల్లె వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ ఫంక్షన్ ఘనంగా నిర్వహించారు.అనంతరం విద్యార్థులకు పరీక్షల ఫైళ్లు బహుమతిగా అందించారు. స్కూల్ హెచ్‌ఎం హమీద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలే మహారాణులు



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథి సునీత

సీకేదిన్నె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మంచి అవకాశాలు, ప్రోత్సాహకం కల్పిస్తే మహిళలు మహారాణులుగా రాణించగలరని అన్నమయ్యజిల్లా అసిస్టెంట్ కమర్షియల్‌ట్యాక్స్ ఆఫీసర్ జె.సునీత తెలిపారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల అన్నమాచార్య విద్యాసంస్థల ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర చాలా గొప్పదన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీరు కీర్తన, ప్రిన్సిపాల్ సుజాతరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు శ్రీచందన, పర్వీన్, సబిత, రేణుక, పుష్పలత, మాధవి, లిఖిత, వాత్సల్య పాల్గొన్నారు.

12న యువత పోరు : అంజాద్‌బాష



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో యువతకు తీరని అన్యాయం జరుగుతోందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఈనెల 12న కలెక్టరేట్ ఎదుట యువత పోరు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. కడప వైసీపీ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అన్నారని, అందులో ఒక్కటి కూడా నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలు పూర్తిస్థాయిలో అన్యాయం అయిపోయారన్నారు. ఈనెల 12న జరిగే యువత పోరును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మేయర్ సురేష్‌బాబు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



వల్లూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాపాఘ్ని నదీ తీరాన మాచిరెడ్డిపల్లె గ్రామంలో పుత్తా నరసింహారెడ్డి కుటుంబీకులచే ప్రతిష్టించిన శ్రీలక్ష్మి నరసింహస్వామి 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి 14వతేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ బ్రహ్మోత్సవాల వివరాలను తెలిపారు. గ్రామీణ క్రీడాపోటీలు కూడా నిర్వహించి వారికి తగిన నగదు పారితోషికాన్ని అందజేస్తామని అన్నారు. ముఖ్యంగా ఎద్దులబండ్ల పోటీలు, రంగస్థల పద్యాలు, అల్లెంగుండు, తాళంభజన పోటీలు నిర్వహిస్తామన్నారు. 14న వారికి నగదు పురస్కారాలను అందిస్తామన్నారు.అలాగే చివరి రోజున శ్రీలక్ష్మి నర్సింహస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

ముస్లింలకు అండగా ఉంటాం : బీటెక్ రవి



పులివెందుల టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పులివెందులలో ముస్లింలకు అండగా ఉంటామని గతంలో ముస్లింలకు ఇచ్చిన భూములును సర్వే చేసి వారి హద్దులు వారికి ఉండేలా చేస్తామని, ముస్లింల ఈనామ్ భూసమస్యలను పరిష్కారం చేసి వారికి న్యాయం చేస్తామని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ముస్లిం ల భూసమస్యలను పరిష్కరించమని వినతిపత్రం అందించిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ గతంలో ముస్లింలకు భూములు ఇవ్వడం జరిగిందని ఆ భూములను కొందరు ఆక్రమించారన్నారు. వాటిని సర్వే చేసి వారి హద్దులు వారికి ఉండేలా చేస్తామన్నారు. అలాగే ముస్లింలకు, మసీదులకు ఈనామ్ భూములను ప్రభుత్వం,దాతలు ఇచ్చారన్నారు. పొరుగున పొలం ఉన్న వారు వాటిని కలుపుకుని సాగు చేసుకుంటున్నారని వాటిని సర్వే చేయించి వారి హద్దులు ఏర్పాటు చేయించి న్యాయం చేస్తామని అన్నారు. కదిరిరోడ్డులో ఒక దాత 55 లక్షలు విలువ చేసే స్థలాన్ని మసీదు నిర్మాణం కోసం ఇచ్చారని అది కూడా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయిస్తామన్నారు. 9 ఎకరాల్లో మసీదు నిర్మాణం కోసం పీస్ కమిటీ అనుమతి రాలేదని అది కూడా వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీలో అవకాశం ఉన్న ప్రతి ప్రాంతంలో కొత్త మసీదుల నిర్మాణానికి ప్రభుత్వం తరఫున సహాయం అందించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహబూబ్‌బాషా, ముస్లింలు పాల్గొన్నారు.

మహిళలు విద్యావంతులు కావాలి

● అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ ● ఘనంగా మహిళాదినోత్సవ వేడుకలు



ప్రొద్దుటూరులో డాక్టర్ నూరి ఫర్వీన్‌ను సత్కరిస్తున్న దృశ్యం



బద్వేలులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

ప్రొద్దుటూరుటౌన్/ జమ్మలమడుగు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఉన్నత చదువులతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆర్డీవో ఆది మూలం సాయిశ్రీ పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు శాఖ, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మహిళలు ఉన్నతస్థాయికి చేరినప్పుడే గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. డీఎస్పీ బావన మాట్లాడుతూ చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందనిన్నారు. ట్రైనీ డీఎస్పీ భవానీ మాట్లాడుతూ లింగ వివక్ష లేకుండా పిల్లలను పెంచినప్పుడే మహిళలపట్ల వివక్ష తొలగిపోతుందన్నారు. అనంతరం వివిద సామాజిక, సేవా రంగాల్లో సేవలు అందించిన మహిళలను ఘనంగా సత్కరించి మెమెంటోలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, వికసిత ఫౌండేషన్ ఛైర్మన్ శూలం లక్ష్మీదేవి, శూలం ప్రసాద్, సావిత్రి, నెహ్రూ యువకేంద్రం సభ్యురాలు భారతి, పాల్గొన్నారు. జమ్మలమడుగులోని గౌషియాషాదీఖానాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలన్నారు. అర్బన్ సీఐ లింగప్ప ఆధ్వర్యంలో కార్యక్ర మం నిర్వహించారు. ప్రొద్దుటూరు ఎన్జీవో హోంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్ర మంలో డాక్టర్ సురేఖ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి. మహిళా విభాగం అధ్యక్షురాలు జయమ్మ, సహాధ్యక్షుడు సదాశివయాదవ్, ఉపాధ్యక్షులు మధు, శివరామానుజ, నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రభంజన్, జాయింట్ సెక్రటరి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా ఒక శక్తి స్వరూపమే

బద్వేలు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా ఓ శక్తి స్వరూపమేనని, మహిళల పట్ల గౌరవభావంతో మెలగాలని నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ దాసరి సుధ అన్నారు. శనివారం రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యాసంస్థ పరి పాల నాదికారి సాయిక్రిష్ణ, బోర్డు మెంబర్ సుజన, మహిళా అధ్యాపకులు షాహిన, లక్ష్మీదే వి, రాధా, డాక్టర్ రామసుధ, సల్మా, తులసి పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: మహిళా సాధికారతతోనే సమాజంలోని అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి పేర్కొన్నారు. శనివారం ఎస్టీయు ఆధ్వర్యంలో పోరుమామిళ్లలోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా మహిళా కమిటీ కన్వీనరు కవిత అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం టికోడూరు ఎంపీపీ చెన్నమ్మను పోరుమామిళ్ల మాజీ జడ్పీటీసీ శారదమ్మ, మాజీ ఎంపీపీ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ పుష్పలత, టేకూరుపేట వైద్యురాలు వివేకానంద సేవాశ్రమం నిర్వాహకు రాలు రామతులసితో పాటు పంచాయతీ పారిశుధ్య కార్మికులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రమణారెడ్డి, బాలగంగి రెడ్డి, రామ్మోహన్, సుబ్రమణ్యం, సౌజన్య పాల్గొన్నారు.

ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా పద్మావతి

కొండాపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా మండలంలోని గండ్లూరు అంగన్‌వాడీ టీచర్ పద్మావతి అవార్డు అందుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా కడపలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి చేతుల మీదుగా శనివారం ఆమె మెమెంటో అందుకున్నారు. అంగనవాడీ పాఠశాలలో పిల్లలను తీర్చిదిద్దడంలో కృషి చేసినందుకు ఆమె ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ముద్దనూరులో: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ మహిళా ఉద్యోగి అవార్డులు శిశుసంక్షేమ శాఖ ముద్దనూరు ప్రాజెక్టు నుంచి ముద్దనూరు మండలానికి సంబందించి అంగన్వాడీ కేంద్రం-1 కార్యకర్త ఎల్.ప్రభావతి అందుకున్నట్లు సీడీపీవో ముంతాజ్ బేగం తెలిపారు. జిల్లా శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు కార్యాలయంలో శిశుసంక్షేమ శాఖ పీడీ శ్రీలక్ష్మి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ముద్దనూరు తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి తమ మాతృమూర్తి ప్రభావతికి ఉత్తమ మహిళా ఉద్యోగి అవార్డు రావడంతో సంతోషం వ్యక్తపరచారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో సీఐ దస్తగిరి ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుల్‌లు కేక్ కట్ చేసి ,శుభాకాంక్షలు తెలియజేశారు.

అట్లూరులో: అట్లూరు మండలంలోని స్త్రీశక్తి భవనం నందు ఎంపీపీ రమాదేవికి తోటి మహిళలు స్థానిక సర్పంచ్ ఎల్లమ్మ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మండలంలోని ఆశా వర్కర్లు, యానిమేటర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొని మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి శివప్రసాద్, అట్లూరు పంచాయతీ సెక్రటరీ ఆనందరావు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్‌లో : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను వాసవీక్లబ్ సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో విశిష్ట వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది డాక్టర్ గాయత్రి బృందా, ల్యాబ్ అసిస్టెంట్ అరుణ, హెడ్ నర్స్ విజయలక్ష్మిలను పూలమాల, శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ పబ్బతి గోపాల్, రీజనల్ చైర్మన్ సూరే సుబ్బరాజు, క్లబ్ ప్రెసిడెంట్ సరేంద్ర, వనిత క్లబ్ ప్రెసిడెంట్ కరమలపూడి జ్యోతి, లేఫూరి లక్ష్మి, ఉషాకిరణ్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో: పురుషులకు దీటుగా మహిళలు రాణిస్తున్నారని ఎంపీడీవో వెంకటరమణయ్య పేర్కొన్నారు. శనివారం మహిళా స్నేహపూర్వక గ్రామంగా ఎంపికైన కలమల్లలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరం మహిళలు ప్రపంచంలో అన్ని రంగాల్లో రాణించి గుర్తింపు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో మహిళలను సన్మానించారు. ఈవోపీఆర్‌డీ రంతుల్లయ్య, సర్పంచి హెబ్సీబా, ఏపీవో జగదీశ్వరి, చిలమకూరు పీహెచ్‌సీ వైద్యులు సాయిచరిత, ఇతర ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

ప్రొద్దుటూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో నేడు ముందుంటున్నారని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోషియేషన్ (హంసా) జిల్లా అధ్యక్షుడు బండి రాజరత్నం పేర్కొన్నారు.శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రిటైర్డ్ జడ్జి ఇస్మాయిల్, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, హంసా రాష్ట్ర పబ్లిసిటీ కార్యదర్శి విజయకుమార్ తాలూకా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 58 మంది శానిటేషన్ సిబ్బందికి బహుమతులు అందజేశారు. : మహిళా స్వేచ్ఛ సాధికారతను ఇంకా సాధించాల్సివుందని ప్రముఖ కవి ఎస్పీ మహమూద్ పేర్కొన్నారు.

గోపవరంలో: గోపవరం మండలం మొల్ల హరిట రెస్టారెంటు వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత మహాకవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గానుగపెంట హనుమంతరావు మొల్ల విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ప్రధాన కార్యదర్శి జీవీ మనోజ్ కుమార్, మొల్ల సాహితీపీఠం ఉపాధ్యక్షులు గుమ్మళ్ల శ్రీనివాసులు, కోడూరు సుమన, బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గురుమూర్తి, నాన బాల వెంకటేశ్వర్లు, ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు సత్తార్ పాల్గొన్నారు.



కొండాపురం: ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి చేతుల మీదుగా మెమెంటో అందుకున్న అంగన్‌వాడీ టీచర్ పద్మావతి

మైదుకూరులో డాక్టర్ గాయత్రిని సన్మానిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు





ముద్దనూరు: కడపలో పీడీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రభావతి

పలువురు మహిళలకు సన్మానం

పోరుమామిళ్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మదర్‌థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాను సన్మానించారు. కార్యక్రమంలో బ్లెస్డ్ బయాన్ అనాధశ్రమం సంస్థ ప్రతినిధులు ఆరోగ్యరాణి, రోజిలీనా, డాక్టర్ అమితా రెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్ర రవిప్రకాశ్ రెడ్డి, గిరిప్రణీత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. స్థానిక స్టేషనులో మహిళా కానిస్టేబుల్ మీనాక్షిని ఎస్ఐ కొండారెడ్డి సన్మానించారు. ఫారెస్టు కార్యాల యంలో మహిళా సిబ్బందిని ఫారెస్టు రేంజర్ రఘునాధరెడ్డి సన్మానించారు.

భార్యపై దాడి కేసులో భర్త అరెస్ట్

చాపాడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలదిన్నె గ్రామానికి వెర్రిబోయిన భాస్కర్ అనే వ్యక్తిని శనివారం అరెస్టు చేసి మైదుకూరు కోర్టులో హాజరుపరచగా కోర్టు వారు అతనికి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 6వ తేదీన (గురువారం) తన భార్య అయిన కళావతిని భాస్కర్ కత్తితో దాడి చేసి గాయపరచడం జరిగిందన్నారు. దీనిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

దువ్వూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం నీలాపురం పరిసర గుట్ట ప్రాంతాల్లో శనివారం పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. వారి వద్ద రూ.15,450 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బస్ షెల్టర్ వద్ద షామియాన ఏర్పాటు



ప్రయాణికుల కోసం షామియాన ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 8(ఆంధ్రజ్యోతి): బస్ షెల్టర్ లేక ఎండాకాలంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కొంత వరకు తీర్చడానికి మైదుకూరు రోడ్డులోని చర్చి కాంప్లెక్స్‌లో ఉన్న శ్రీగౌరీ శంకర్ సప్లయర్స్ యజమాని కె. మైసుర్ రాజ యాదవ్ షామియాన ఏర్పాటు చేశారు. 'బస్సు షెల్టర్ నిర్మించరూ..' అనే శీర్షికతో ఈ నెల 7వ తేదీన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన శ్రీ గౌరీ శంకర్ సప్లయర్స్ యజమాని కె. మైసుర్ రాజ యాదవ్ ఆరవేటి థియేటర్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం షామియాన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీవీఎస్, అన్వర్ థియేటర్ల వద్ద కూడా స్థానిక షాపు యజమానులు, ప్రభుత్వ అధికారులు అనుమతులు ఇస్తే అక్కడ కూడా ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు ఏర్పా టు చేస్తానన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని గీతాంజలి హైస్కూలు ఛైర్మన్ శ్రియారెడ్డి పేర్కొన్నారు. శనివారం గోల్డెన్ పార్కులో గీతాంజలి ఉత్సవ్ పేరుతో గీతాంజలి హైస్కూలు 20వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

జమ్మలమడుగు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పెద్దపసుపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఇండ్ల శ్రీనివాసులు 47 మంది పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష సామగ్రిని వితరణగా అందజేశారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా పరీక్షలు రాసి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు పాల్గొన్నారు.

స్వామిత్ర సర్వే పక్కాగా చేయాలి


జమ్మలమడుగు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగే స్వామిత్ర సర్వే కార్యక్రమం పక్కాగా చేయాలని జమ్మలమడుగు డీఎల్‌పీవో తిమ్మక్క సూచించారు. శనివారం డివిజనల్ సభాభవనంలో స్వామిత్ర సర్వే కార్యక్రమానికి సంబందించి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎల్‌పీవో మాట్లాడుతూ సర్వే అధికారులు ఇంటింటికి వెళ్లి ఇంటి చుట్టూ కొలతలు వేసి గతంలో ఉన్న రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలు, సర్వే నంబర్లు, మ్యాపులు పరిశీలించి గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రారెడ్డి, సర్వేయర్ హరి, వెంకటేష్, పవన్, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గ్రామాల సర్వే కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వామిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బద్వేలు డివిజను పంచాయతీ అధికారి రమణారెడ్డి సూచించారు. శనివారం మండలంలోని స్త్రీశక్తి భవనంలో డివిజనులో 9 మండలాలకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరిగ్ అసిస్టెంట్లకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో డీఎల్‌పీవో రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నాన్ అగ్రికల్చర్ స్థలాలు, భవనాలు ఇతరఆస్తులు సర్వే చేసి వాటిని ప్రత్యేకసంఖ్యలో నమోదు చేస్తామన్నారు. శిక్షకులు ఓబులేసు, పురుషోత్తంరెడ్డి, మధుసూదనరెడ్డి, ఉదయకుమార్‌లు పలు అంశాలపై వివరించారు.

పోరాటాలతోనే హక్కులను సాధించవచ్చు

ప్రొద్దుటూరు , మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : సంఘటిత పోరాటాలతోనే మహిళల హక్కులు సాధించవచ్చని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ పిలుపునిచ్చారు. శనివారం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో స్థానిక వసంతపేట సాయిబాబా కొట్టాలలో మహిళాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మట్లాడుతూ సాయిబాబా కొట్టాలలో మహిళలు సంఘటితంగా పోరాడి తమ ఇళ్ల పరిసరాల్లో మద్యం దుకాణం లేకుండా చేశారన్నారు.మహిళలపై దాడులు హింస పెరిగిపోవడానికి మద్యం కారణమన్నారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి వుంటే మద్య నిషేధం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో చైతన్యమహిళా సంఘం కమిటీ సభ్యులు జింకా విజయలక్ష్మీ, లక్ష్మీదేవి, పార్వతీ లక్ష్మీ, రూప, సరస్వతిలు పాల్గొన్నారు.

సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

బద్వేలుటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సమాజంలో మహిళలకు ఇంటా బయట అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని వాటిని ధైర్యంగా ఎదుర్కొని ముందడుగు వేయాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, సీఐలు రాజగోపాల్, నాగభూషణంలు పేర్కొన్నారు. శనివారం బాలుర ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థినులతో అంగన్వాడీ, మహిళా పోలీసులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో సెల్‌ఫోన్ యుగం నడుస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి, ఎస్ఐలు రవికుమార్, శ్రీకాంత్, అంగన్వాడీ సూపర్వైజలర్లు, తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లకు దరఖాస్తు చేసుకోండి

పోరుమామిళ్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 17పంచాయతీ పరిధిల్లో ఉన్న అర్హులైన బీసీ, ఈడబ్ల్యుఎస్, కాపు మహిళలు కుట్టుమిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మహిళలు గ్రామ సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్ల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వాటిని పరిశీలించిన అనంతరం అర్హులను ఎంపిక చేస్తారని తదుపరి నియోజకవర్గ స్థాయిలో శిక్షణ ఇస్తామన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన టీడీపీ నేతలు



బద్వేలు, మార్చి8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సబితను మాజీ ఎమ్మెల్యే కె . విజయమ్మ, తెలుగు మహిళా అధ్యక్షురాలు మాచుపల్లి లక్ష్మీదేవి శనివారం కడపలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ బద్వేలులో నెలకొన్న పలు సమస్యలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సునీత, హబీబున్నీసా, అరుణమ్మలు జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

రాజీ మార్గం ద్వారా కేసుల పరిష్కారం



కేసు పరిష్కార అవార్డును అందిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ

బద్వేలు రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రాజీమార్గం ద్వారా కేసులు పరిష్క రించుకుని ప్రశాంత జీవనం గడపాలని సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.విజయలక్ష్మిలు పేర్కొన్నారు. శనివారం కోర్టు హాలులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రెండు బెంచ్‌లను ఏర్పాటు చేయగా మొదటి బెంచ్ సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ, రెండో బెంచ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.విజయలక్ష్మిలు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు 269, సివిల్ 14 కలిపి 53,57,662 రూపాయలకు పరిష్కారం జరిగినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కేసుల్లో రాజీ కావడం వల్ల ఇద్దరూ గెలిచినట్లే..



జమ్మలమడుగులో మాట్లాడుతున్న జడ్జి భార్గవి

జమ్మలమడుగు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు రాజీ మార్గంలో కేసులు పరిష్కారం చేసుకోవడం వలన ఇద్దరూ గెలిచినట్లేనని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ముందుగా ఏర్పాటు చేసిన సమావేశంలో కక్షిదారులను ఉద్దేశించి జడ్జి మాట్లాడారు.బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి మాట్లాడుతూ కక్షిదారులు లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం వలన వారికి సుప్రీం కోర్టు తీర్పుతో సమానంగా ఉంటుందన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని జడ్జి భార్గవిని, న్యాయవాదులు, మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

భారీస్థాయిలో కేసులు పరిష్కారం

జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భారీస్థాయి కేసులు పరిష్కారం జరిగాయి. వివిధ కేసులకుసంబంధించి మొత్తం 1005 కేసులు పరిష్కారం అయినట్లు లోక్ అదాలత్ సభ్యురాలు సంధ్య తెలిపారు. ఇందుకు సంబందించి కేసుల పరిష్కారంలో రూ.90,72,967 పరిష్కారం అయిందన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి



చెక్కులను అందజేస్తున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. జమ్మలమడుగులో కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

టీడీపీ కార్యాలయంలో శనివారం జమ్మలమడుగు నియోజకవర్గంలో వివిధ ఇబ్బందుల వలన ప్రజలు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు భూపేశ్‌రెడ్డి అందజేశారు. మొత్తం రూ.3.45 లక్షల చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తలమంచిపట్నం లక్ష్మణనాయుడు, జయరాముడు, చౌడం జొల్లు పాండు, రాజా పాల్గొన్నారు.

అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు విద్యుత్ శాఖ ఆఫర్

ఎర్రగుంట్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గృహాలకు వినియోగించే అదనపులోడ్ క్రమబద్ధీకరణకు విద్యుత్ శాఖ ఆఫర్‌ను ప్రకటించినట్లు డిస్కం ఏఈ ప్రియదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 1కిలో వాట్‌కు రూ.2250 చెల్లించాలని అయితే ఆఫర్ కింద రూ.1250 మాత్రమే చెల్లించాలన్నారు. అలాగే 2కిలోవాట్లకు రూ.4450గాను రూ.2450, 3కిలో వాట్స్‌కు రూ.6650గాను ఆఫర్ కింద రూ.3650, 4కిలో వాట్స్‌కు 8850గాను 4850, 5కిలో వాట్స్‌కు 11,050గాను రూ.6050 ఆఫర్‌కింద చెల్లించి సర్వీసును క్రమబద్ధీకరణ చేసుకోవచ్చునని డిస్కం ఏఈ తెలిపారు.

జ్యోతిక్షేత్రంపై రాజకీయాలు చేయడం తగదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కాశినాయన, మార్చి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పవిత్రమైన జ్యోతి క్షేత్రంపై రాజకీయాలు చేయడం వైసీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి తగదని మండల టీడీపీ అధ్యక్షుడు మురుకూటి రాజారెడ్డి, కడప టీడీపీ ఉపాధ్యక్షుడు అక్కంపేట గురివిరెడ్డి, సీనియర్ టీడీపీ నాయకుడు కె.దుగ్గిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ గోవిందరెడ్డి జ్యోతిక్షేత్రంపై కపట ప్రేమను వొలగబోస్తూ జ్యోతిలో నిర్మాణాలను కూటమి ప్రభుత్వమే కూలదోస్తోందని అసత్య ఆరోపణలతో మీడియాముందు గగ్గోలు పెట్టడం ఎంతవరకు సబబో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. 20 సంవత్సరాలుగా చట్టసభల్లో ప్రజాప్రతినిధిగా ఉండడంతోపాటు గత 5 సంవత్సరాలు వైసీపీ ప్రభుత్వమే అధికారంలోఉన్నా ఏనాడైనా జ్యోతి క్షేత్రం గూర్చి గాని కాశినాయన గుడి నిర్మాణానికి ఏర్పడిన అవరోధాలపైన సభలో మాట్లాడావా ప్రశ్నించారు. ఇప్పటివరకు జ్యోతి అభివృద్ధిలో మీపాత్ర ఈసమంతైనా ఉందని నిరూపించగలవా అంటూ వారు సవాల్ విసిరారు. ఇప్పటికైనా రాజకీయాలు పక్కనపెట్టి జ్యోతి సమస్య పరిష్కారానికి కలిసిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.విజయ్‌కుమార్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వై.సుదాకర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, రామచంద్ర, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు సంఘటితం కావాలి

బద్వేలుటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జరుగుతున్న వర్గీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గస్థాయిలో మాలలందరూ ఏకమై ఐక్యతను చాటాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు భాస్కర్ పేర్కొన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో బద్వేలు పట్టణంలో శనివారం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని మురళీ అధ్యక్షతన స నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాలలకు జరుగుతున్న అన్యాయాలను కార్యకర్తలకు వివరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో మండలాల్లో నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడుగా వంకెల సుబ్బరాయుడు, కార్యదర్శిగా దాసరి క్రిష్ణ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవహక్కుల రాష్ట్ర కార్యదర్శి ముత్యాల ప్రసాద్, సుధాకర్, వెంకటరమణ, చిన్నగంగయ్య, నారాయణ, వెంకటయ్య, ఓబయ్య, తిరుపాల్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

ప్రొద్దుటూరు - A.C.O.: 99854 11466 | జమ్మలమడుగు - S.R.: 94404 72816 | మైదుకూరు - S.R.: 91334 42886 | బద్వేల్ - S.R.: 99666 83437 | D.C.M. : 99854 11184